క్లుప్తంగా

గురుకులంలో స్పాట్ కౌన్సెలింగ్

దమ్మపేట: మండల కేంద్రంలోని గిరిజన గురుకుల కళాశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశం కోసం ఈ నెల 28వ తేదీ (సోమవారం)న, ఉమ్మడి ఖమ్మం జిల్లా విద్యార్థులకు స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ జాను నాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశానికి ఆసక్తి గల విద్యార్థులు 2023 పదో తరగతి ఫలితాల్లో ఏడు పాయింట్లు, అంతకు పైబడి సాధించి, తప్పనిసరిగా ఇంగ్లిష్ మీడియంలో చదివి ఉండాలని పేర్కొన్నారు. స్పాట్ కౌన్సెలింగ్‌కు హాజరయ్యే విద్యార్థులు అన్ని రకాల ఒరిజనల్ సర్టిఫికెట్లు తీసుకుని, సోమవారం ఉదయం 10 గంటల్లోపు, దమ్మపేట కళాశాలకు హాజరు కావాలని తెలియజేశారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

మణుగూరురూరల్: 18సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలని మణుగూరు మున్సిపల్ కమిషనర్ ఉమామహేశ్వరరావు సూచించారు. శనివారం పైలట్ కాలనీలోని ప్రత్యేక ఓటర్ నమోదు కేంద్రం వద్ద లయన్స్ క్లబ్ ఆఫ్ మణుగూరు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్ హాజరై మాట్లాడారు. లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు గాజుల పూర్ణచందర్‌రావు, షేక్ మీరాహుస్సేన్, బూత్ లెవల్ అధికారులు కేశవరావు, వెంకటరమణ, నరసమ్మ, రాములు, కుమారి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రక్షణ కల్పించండి..

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని కొర్రాజులగుట్ట ప్రాంతానికి చెందిన కొండసాని నారీమణి అనే మహిళ తనకు ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని పోలీసులను కోరుతోంది. ఈ మేరకు శనివారం భద్రాచలంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో తన ఇద్దరు కూతుళ్లు జ్యోతి, స్వాతిలతో కలిసి మాట్లాడారు. ఇటీవలే దెబ్బతిన్న తన ఇల్లును బాగు చేసుకుంటుండగా గడ్డం చిట్టెమ్మ, ఆమె కుమారులు, ఇతర కుటుంబ సభ్యులతో కలిసి తమపై దాడి చేశారని, దీనిపై పోలీసు స్టేషన్‌లో కేసు పెట్టామని తెలిపారు. దీంతో వారు నిత్యం తమను వెంటాడుతూ, దుష్ప్రచారాలు చేస్తున్నారని కన్నీరుమున్నీరయ్యారు. వారి నుంచి మాకు ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని ఆమె పోలీసులను కోరారు.

'చంద్రయాన్-3'పై క్విజ్

అశ్వారావుపేటరూరల్: మండలంలోని నారాయణపురం గ్రామంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులకు చంద్రయాన్–3 విజయవంతం కావడం పట్ల క్విజ్, వ్యాస రచన, చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు హలవత్ హరిబాబు ఆధ్వర్యంలో విద్యార్థులకు ఈ పోటీలను నిర్వహించగా.. చంద్రయాన్–3 చిత్ర లేఖనం గీసిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. పోటీల్లో విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు సాయిబాబు, మల్లేశ్వరరావు, సుజాత, అరుణ పాల్గొన్నారు.

కేసులు నమోదు చేయాలి

అశ్వారావుపేటరూరల్: భూమి విషయంలో ఒత్తిడి చేస్తున్న అటవీ శాఖ అధికారులు, సిబ్బందిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని గిరిజన మహిళలు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మండలంలోని వాగొడ్డుగూడెం గ్రామ శివారులోని తమ భూముల్లో నుంచి ఖాళీ చేయాలని స్థానిక అటవీ శాఖ అధికారులు ఒత్తిడి చేస్తున్నట్లు ఆరోపించారు. గిరిజన మహిళలను ఇబ్బందులు పెట్టి, దుర్భాషలాడుతున్న ఫారెస్ట్ శాఖ అధికారులపై తక్షణమే కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో కొర్సా సునీత, సరియం వీరమ్మ, కొర్రి తిరుపతమ్మ, కొర్సా సావిత్రి, కుంజా పార్వతి ఉన్నారు.

ఆలయ వార్షికోత్సవం

చంద్రుగొండ: మండలకేంద్రం చంద్రుగొండలోని శ్రీమహాలక్ష్మి ఆలయ వార్షికోత్సవం శనివారం వైభవోపేతంగా నిర్వహించారు. దీంతో గ్రామం అంతా సందడి నెలకొంది. వందలాది మంది మహిళలు భక్తిశ్రద్ధలతో బోనమెత్తి అమ్మవారికి సమర్పించారు. ప్రధాన పూజారి వీవీఆర్‌కే మూర్తి ఆధ్వర్యంలోకార్యక్రమాలు కొనసాగాయి. టీపీసీసీ సభ్యురాడు వగ్గెల పూజ పాల్గొని బోనమెత్తారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కొడకండ్ల వెంకటరెడ్డి దంపతులు, ఆలయాల నిర్వహణ కమిటీ చైర్మన్ చీదళ్ల పవన్‌బాబు, కిరణ్‌రెడ్డి, బుంగా శ్రీను, సంకా శంకర్, కడియాల నాగేశ్వరరావు, పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

గుండాల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఐఎఫ్‌టీయూ జాతీయ కమిటీ పిలుపు మేరకు 29న హైదరాబాద్‌లో నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి కొక్కు సారంగపాణి, ఏరియా కార్యదర్శి యాసారపు వెంకన్నలు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సమావేశంలో పూనెం కవిత, శైలజ, బాల్య కిరన్, రవి, నాగేష్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమంలా హరితహారం

- యజ్ఞంలా సాగిన 'ఒకే రోజు–కోటి మొక్కలు' కార్యక్రమం
- హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు
- నాటడమే కాదు.. సంరక్షించాలని హితవు



భద్రాచలంఅర్బన్: మొక్క నాటుతున్న ఆర్డీఓ మంగీలాల్, ఇతర అధికారులు



మణుగూరురూరల్: మొక్క నాటుతున్న ఎఫ్‌డీఓ మక్సూద్ మొహియుద్దీన్



పినపాక పంచాయతీలో మొక్క నాటుతున్న రేంజ్ అధికారి తేజస్వి



మొక్క నాటుతున్న ఎంపీడీఓ, ఇతర అధికారులు

భద్రాచలంఅర్బన్: కాలుష్యరహిత వాతావరణం కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని భద్రాచలం ఆర్డీఓ మంగీలాల్ పిలుపునిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా 'ఒకే రోజు–కోటి మొక్కలు' నాటే కార్యక్రమంలో భాగంగా భద్రాచలం పట్టణంలో నిర్వహించిన హరితహారం కార్యక్రమానికి ఆయన హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మంగీలాల్ మాట్లాడుతూ.. శనివారం భద్రాచలంలో దాదాపు 600 మొక్కలు నాటినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ నాగలక్ష్మి, తహశీల్దార్ శ్రీనివాస్, గ్రామ పంచాయతీ ఈవో వెంకటేశ్వర్లు, ఐకేపీ ఏపీవో జగదీష్, ఆర్ఐ నరసింహారావు, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.
చంద్రుగొండ: మండల స్పెషల్ ఆఫీసర్ సంజీవరావు హరితహారం కార్యక్రమాన్ని శనివారం ఆయన ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సాదియాసుల్తాన, ఎంపీడీఓ గద్దె రేవతి, ఫారెస్టు రేంజర్ ప్రసాదరావు, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎస్డీ రసూల్ పాల్గొన్నారు.
మణుగూరురూరల్: సమితిసింగారం గ్రామపంచాయతీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎంపీపీ కారం విజయకుమారి, సర్పంచ్ బచ్చల భారతి, రథంగుట్ట అర్బన్ పార్క్‌లో ఎఫ్‌డీఓ మక్సూద్ మొహియుద్దీన్, సాంబాయిగూడెం పంచాయతీ కార్యాలయం ఆవరణలో సర్పంచ్ తిరుపతమ్మలు మొక్కలు నాటారు. కార్యక్రమాల్లో ఎఫ్ఆర్ఓ ద్వాలియా, ఎంపీఓ పి.వెంకటేశ్వరరావు, కళాశాల అధ్యాపకులు, పాఠశాల ఉపాధ్యాయులు, ఫారెస్ట్ సిబ్బంది, పంచాయతీల కార్యదర్శులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.
దుమ్ముగూడెం: 'ఒకే రోజు–కోటి మొక్కలు' కార్యక్రమంలో భాగంగా కొత్తపల్లి పంచాయతీలో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ తెల్లం సీతమ్మ మాట్లాడారు. ఎంపీపీ రేసు లక్ష్మి, ఎంపీడీఓ ముత్యాలరావు, ఏపీఓ సుకన్య, సర్పంచ్ గుండి వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ పూసం ధర్మరాజు,రేంజర్ కనకమ్మ అటవీశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.
గుండాల: కోటి మొక్కల కార్యక్రమంలో భాగంగా గుండాల, ఆళ్లపల్లి మండలాల్లోని అన్ని పంచాయతీలలో మొక్కలు నాటారు. ఎంపీపీ ముక్తి సత్యం కార్యక్రమాల్లో పాల్గొని మాట్లాడారు. సర్పంచ్ కోరం సీతారాములు, తహశీల్దార్ రంగా, ఎంపీడీఓ సత్యనారాయణ, ఎంపీఓ వలీ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.
అశ్వారావుపేటరూరల్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో శనివారం కోటి మొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి వివిధ రకాల మొక్కలు నాటారు. కార్యక్రమంలో సర్పంచ్ నార్లపాటి సుమతి, కళాశాల ప్రిన్సిపాల్ సాగర్, కార్యదర్శులు శ్రీరామ్మూర్తి, హరికృష్ణ, ఈజీఎస్ ఈసీ నరేష్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.
పినపాక: పంచాయతీ పరిధిలో ఎంపీపీ గుమ్మడి గాంధీతో కలిసి పినపాక మండల అటవీ రేంజ్ అధికారి కె.తేజస్విని శనివారం మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీఓ వెంకటేశ్వరరావు, సర్పంచ్ నాగేశ్వరరావు, ఎన్ఆర్ఈజీఎస్, ఫారెస్ట్ అధికారులు పాల్గొన్నారు.
బూర్గంపాడు: కోటి వృక్షార్చనలో భాగంగా శనివారం ఇరవెండి గ్రామపంచాయతీలోని బృహత్ పల్లెప్రకృతి వనంలో 1000 మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ వివేక్‌రామ్ మాట్లాడారు. ఏపీఓ విజయలక్ష్మి, సర్పంచ్ కొర్సా లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి దివ్య, టెక్నికల్ అసిస్టెంట్ వెంకట్, ఈజీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.
అశ్వాపురం: మండలంలో 24 గ్రామ పంచాయతీలలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున మొక్కలు నాటారు. అశ్వాపురంలో ఎంపీపీ ముత్తినేని సుజాత, తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీఓ వరప్రసాద్, వైస్‌ఎంపీపీ వీరభద్రం, ఆర్ఐ నాగమణి, అశ్వాపురం సర్పంచ్ బాణోత్ శారద , పంచాయతీ కార్యదర్శి కృష్ణచైతన్య మొక్కలు నాటారు.

అన్నపురెడ్డిపల్లిలో వైద్యశిబిరం



చంద్రుగొండ: స్థానిక వైద్యసిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారులు

అన్నపురెడ్డిపల్లి: మండల పరిధిలోని ఎర్రగుంట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో అన్నపురెడ్డిపల్లిలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామస్తులకు మండల వైద్యాధికారిణి డాక్టర్ ప్రియాంక వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను పంపిణీ చేశారు. గ్రామంలోని జ్వరపీడితుల ఇళ్లను సందర్శించి, పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలోని ప్రైవేట్ ల్యాబ్‌లను, క్లినిక్‌లను సందర్శించి ఆర్ఎంపీలకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ కృష్ణయ్య, హెచ్‌వీ శారారాణి, హెచ్ఎస్ నాగేశ్వరరావు, ఏఎన్ఎంలు, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

మహ్మద్‌నగర్‌లో రెండో రోజు..

చంద్రుగొండ: మండల పరిధిలోని మహ్మద్‌నగర్ గ్రామంలో రెండోరోజు శనివారం డాక్టర్ కనకం తనుజా ఆధ్వర్యంలో మెగా వైద్యశిబిరం నిర్వహించారు. జ్వరపీడితులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. నీరు నిల్వ ఉన్న గుంతల్లో తేమోఫాస్ చల్లించారు. పలు ఆరోగ్య సూచనలు చేశారు. జిల్లా సర్వైలెన్స్ అధికారి డాక్టర్ పర్షియానాయక్, డాక్టర్ ఇమ్మానియల్, ఏఎంఓ గొంది వెంకటేశ్వర్లు, ఎస్‌యుఓ కుమారస్వామి వైద్యశిబిరాన్ని పరిశీలించారు. పూర్తిస్థాయిలో ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని స్థానిక వైద్యాధికారులకు సూచించారు. కార్యక్రమంలో డాక్టర్లు రాకేష్‌కుమార్, ప్రవీణ్ కుమార్, హెల్త్ సూపర్‌వైజర్ యండి.ఇమాం వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో..

మండలంలోని మహ్మద్‌నగర్ గ్రామంలో శనివారం సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో హెల్త్‌క్యాంప్ ఏర్పాటు చేశారు. షుగర్, బీపీ, గుండె, ఉబకాయంలకు సంబంధించిన వ్యాధులకు పరీక్షలు చేశారు. వ్యాధులకు సంబంధించి డాక్టర్లు గ్రామస్తులకు అవగాహన కల్పించారు. మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సింగరేణి రుద్రంపూర్ హాస్పిటల్ డాక్టర్ జేతురామ్, స్టాఫ్‌నర్స్ యండి.నజియాబేగం, సీనియర్ పీఓ యం.శ్రవణ్‌కుమార్, పిట్ సెక్రటరీ సీహెచ్ నాగరాజు కొత్తగూడెం ఏరియా టీబీజీకేఎస్ వైస్‌ప్రెసిడెంట్ యండి.రజాక్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌ను ఓడిస్తాం..

అశ్వాపురం: కమ్యూనిస్టు పార్టీని మోసం చేసిన బీఆర్‌ఎస్‌ను ఓడించి తగిన బుద్ధి చెబుతామని సీపీఐ మండల కార్యదర్శి అనంతనేని సురేష్, జిల్లా కార్యవర్గ సభ్యుడు కమటం వెంకటేశ్వరరావు అన్నారు. మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో శనివారం జరిగిన పార్టీ మండల కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడారు. రాబోయే కాలంలో కమ్యూనిస్టులు ముఖ్య పాత్ర పోషిస్తారని వచ్చే ఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీల సత్తా చూపిస్తామన్నారు. సమావేశంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శులు సురేందర్‌రెడ్డి, రాయపూడి రాజేష్, ఈనపల్లి పవన్‌సాయి, శ్రీనివాసరావు, నాయుడు, ఇరుగు శ్రీకాంత్, సత్యనారాయణ, వెంకన్న, నరసింహారావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముంపు బాధితుల ఆందోళన



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహిస్తున్న గోదావరి ముంపు బాధితులు

చర్ల: గోదావరి వరద ముంపు ప్రాంత బాధితులందరికీ ఎత్తైన ప్రాంతాల్లో ఇంటి స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేస్తూ వరద బాధితుల పోరాట సంఘం ఆధ్వర్యంలో శనివారం చర్లలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక బస్టాండ్ సెంటర్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ తీసి అక్కడ తహసీల్‌ను ముట్టడించారు. నినాదాలు చేస్తూ ధర్నా నిర్వహించారు. బాధితులకు కుటుంబానికి 5 సెంట్ల ప్రభుత్వ భూమిని ఇవ్వాలని, ఇంటి స్థలాలను ఆక్రమించుకుంటున్న సందనకభంలో పోలీసులు చేస్తున్న దాడులను ఆపాలని డిమాండ్ చేశారు. ముంపు బాధితులకు సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా, కాంగ్రెస్, బీఎస్పీలు మద్దతు తెలుపాయి. ఆయా పార్టీల నేతలు కెచ్చెల రంగారెడ్డి, నల్లపు దుర్గాప్రసాద్, తడికల శివకుమార్‌లు మాట్లాడుతూ.. బాధితులకు రక్షణ కల్పించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు.

అనంతరం తహసీల్దార్ రంగు రమేష్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా రాష్ట్ర నాయకుడు ముద్దా బిక్షం, అఖిల భారత రైతు సంఘం జిల్లా కార్యదర్శి కల్లూరి కిశోర్, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు దాసరి సాయి, వరద బాధితుల పోరాట సంఘం గౌరవ అధ్యక్షుడు, సీపీఐ ప్రజాపంథా మండల కార్యదర్శి కొండా చరణ్, కొండా కౌషిక్, కార్యదర్శి బోడా సందీప్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆవుల విజయ భాస్కర్‌రెడ్డి, బీఎస్పీ మండల అధ్యక్షుడు కూరపాటి వీర్రాజు వివిధ పార్టీలకు చెందిన నాయకులు, బాధితులు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం మండల తహసీల్దార్‌గా కె.చంద్రశేఖర్ శనివారం బాధ్యతలు చేపట్టారు. కరీంనగర్ జిల్లా నుంచి బదిలీ అయ్యి ఇక్కడకు వచ్చారు. ఇక్కడ తహసీల్దార్ శిరిషా సుజాతనగర్ బదిలీ అయిన విషయం తెలిసిందే. బాధ్యతలు చేపట్టిన తహసిల్దార్‌ను ఆర్ఐలు ఆదినారాయణ, లక్ష్మయ్య కార్యాలయ సిబ్బంది కలిసి అభినందనలు తెలియజేశారు.

పోస్టర్లు ఆవిష్కరణ

చండుగొండ: ఓపెన్‌స్కూల్ సొసైటీకి సంబంధించిన పోస్టర్‌ను శనివారం తహసీల్దార్ సాదియాసుల్తాన, ఎంపీడీఓ గద్దె రేవతి, ఎంఈఓ సత్తెనపల్లి సత్యనారాయణతో కలిసి శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఓపెన్‌స్కూల్ కోఆర్డినేటర్ మద్దినేని పాపారావు మాట్లాడుతూ.. చదువు మధ్యలో ఆపేసిన వారికి ప్రభుత్వం ఓపెన్‌స్కూల్ ద్వారా మంచి అవకాశం కల్పించిందన్నారు. ఆసక్తిగల వారు స్థానిక ఎస్‌కేఎం కాలేజీలో అడ్మిషన్‌లు తీసుకోవచ్చన్నారు. అసిస్టెంట్ కోఆర్డినేటర్ రాజు, ఎన్.గురుమూర్తి పాల్గొన్నారు.

ఆలయానికి విరాళాలు

బూర్గంపాడు: లక్ష్మీపురం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ముత్యాలమ్మ ఆలయానికి జెడ్పీటీసీ సభ్యురాలు కామిరెడ్డి శ్రీలత, రామకొండారెడ్డి దంపతులు శనివారం రూ.50వేల విరాళం అందజేశారు. అదేవిధంగా గ్రామానికి చెందిన మాజీ సొసైటీ చైర్మన్ పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, ధనలక్ష్మి దంపతులు కూడా ఆలయ నిర్మాణానికి రూ.50వేల ఆర్థికసాయాన్ని అందించారు. ఆలయ నిర్మాణం నిర్విఘ్నంగా త్వరితగతిన పూర్తిచేయాలని నిర్వహణ కమిటీకి సూచించారు.

అన్నదానం

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని కూనవరం రోడ్డులో ఉన్న సరోజిని వృద్ధాశ్రమంలో శనివారం గోళ్ల భూపతిరావు కుమారుడు వరుణ్ కుమార్, కుమార్తె స్వప్న, మనుమరాళ్లు జ్యోషిక, తరుణికలు అన్నదానం చేశారు. స్వయంగా వృద్ధులకు ఆహారాన్ని అందజేశారు. అనంతరం ఆశ్రమ ఆవరణలో గులాబీ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వరుణ్ కుమార్ మాట్లాడుతూ.. తన నాన్న లాగే తాను కూడా భద్రాచలంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తానని తెలిపారు.

బురద తొలగింపు

అశ్వాపురం: మండల కేంద్రం నుంచి గొందిగూడెం వెళ్లే రహదారి బురదమయమై అస్తవ్యస్తంగా ఉండి స్థానికులు తీవ్ర ఇబ్బంది పడుతుండడంతో స్పందించిన స్థానికుడు పరుచూరి రాకేష్ తన సొంత ఖర్చులతో శనివారం డోజర్ ట్రాక్టర్‌తో రహదారిపై ఉన్న బురదను తొలగించాడు. కొంత మేరకు ఇబ్బంది తొలగించిన రాకేష్‌ను స్థానికులు అభినందించారు. రహదారికి నిధులు మంజూరై నెలలు గడుస్తున్నా కాంట్రాక్టర్ రహదారి పనులు చేపట్టకపోవడంపై ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు శనివారం ఆర్‌అండ్‌బీ అధికారులు, కాంట్రాక్టర్‌తో మాట్లాడారు. వెంటనే రహదారి పనులు ప్రారంభించాలని ఆదేశించారు. రెండు రోజుల్లో రహదారి పనులు ప్రారంభిస్తామని కాంట్రాక్టర్ తెలిపాడు.

లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న మెజిస్ట్రేట్ వెంకటేశ్వర్లు

మణుగూరురూరల్: సెప్టెంబర్ 9వ తేదీన మణుగూరు ప్రథమశ్రేణి జ్యుడిషియల్ కోర్టులో జరిగే జాతీయ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోర్టు మెజిస్ట్రేట్ ఎం.వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం కోర్టులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాజీపడదగిన కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు. శ్రీనివాసరావు, విజయరావు, భాస్కర్, శైలజ, పద్మ, సావిత్రి, లావణ్య, సాంబశివరావు, మధు, వెంకట్, కోర్టు సిబ్బంది రేఖ, కానిస్టేబుల్ మురారి పాల్గొన్నారు.

భద్రాచలంపై స్పష్టమైన ప్రకటన చేయాలి

భద్రాచలంఅర్బన్: కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా భద్రాచలం అభివృద్ధిపై స్పష్టమైన ప్రకటన చేయాలని కోరుతూ శనివారం పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో సీపీఎం ఆధ్వర్యంలో ప్లకార్డులు పట్టుకుని నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి మాట్లాడుతూ.. భద్రాచలం పట్టణానికి అనుకుని ఉన్న ఐదు పంచాయతీలను తెలంగాణలో కలుపుతూ స్పెషల్ ఆర్డినెన్స్ తెచ్చే విధంగా అమిత్ షా స్పష్టమైన ప్రకటన ఇవ్వాలని డిమాండ్ చేశారు. పోలవరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌తో భద్రాచలం పట్టణానికి ముంపు ఉన్న నేపథ్యంలో రెండు తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలతో చర్చించి భద్రాచలం పట్టణానికి రక్షణకు చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. జిల్లా కమిటీ సభ్యుడు మర్లపాటి రేణుక, సున్నం గంగా, భూక్యా రమేష్, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యుడు వైవి.రామారావు, నాదెళ్ల లీలావతి, పట్టణ కమిటీ సభ్యులు డి.సీతాలక్ష్మి, యు.జ్యోతి, జీవనజ్యోతి పాల్గొన్నారు.

నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం



క్లబ్ అధ్యక్షుడిగా బాధ్యతలు తీసుకుంటున్న జయంత్‌కుమార్ దాస్

బూర్గంపాడు: సారపాకలోని ఐటీసీ కళాభారతిలో రోటరీ క్లబ్ ఆఫ్ ఇన్ భద్రా నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం శుక్రవారం రాత్రి నిర్వహించారు. ఐటీసీ అనుబంధ రోటరీ క్లబ్ ఆఫ్ ఇన్ భద్రా అధ్యక్షుడిగా జయంత్‌కుమార్ దాస్, కార్యదర్శిగా కేవీఎస్ గోవిందరావులు బాధ్యతలు తీసుకున్నారు. రోటరాక్ట్ అధ్యక్షుడిగా ఎస్.మురళి, కార్యదర్శిగా గాయత్రీదేవిలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ ఆఫ్ ఇన్ భద్రా అధ్యక్షుడు జయంత్‌కుమార్ దాస్, రోటరీ డిస్ట్రిక్ట్–3150 గవర్నర్ బూసిరెడ్డి శంకర్‌రెడ్డిలు మాట్లాడారు. ఈ సందర్భంగా గత ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదివి మంచి మార్కులు సాధించిన 24మంది బాలికలకు నగదు ప్రోత్సాహకాలను అందించారు. కార్యక్రమంలో ఐటీసీ పీఎస్‌పీడీ యూనిట్‌హెడ్ సిద్ధార్థ మొహంతి, రోటరీ క్లబ్ పీడీజీ జె.అబ్రహం, ఏజీ సత్యనారాయణ, ఐటీసీ ఉన్నతాధికారులు, రోటరీ ప్రతినిధులు శ్యామ్‌కిరణ్, చెంగలరావు,హరినారాయణన్,కే రాంబాబు, మరదాన శ్రీనివాస్, సౌరబ్ ముఖర్జీ, చాంద్‌పాషా, నాగ మల్లేశ్వరరావు, యేగి చంద్రశేఖర్, పాకాల దుర్గాప్రసాద్, పి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రహదారి నిర్మించాలి

దుమ్ముగూడెం: మండలంలోని రామారావుపేట గ్రామంలో పొలాల్లోకి వెళ్లే దారి సమస్యాత్మకంగా మారింది. శనివారం తెల్లవారుజామున నాలుగు గంటలకి కురిసిన వర్షానికి ఆ రోడ్డుపై నుంచి వాగు నీరు మోకాళ్ల లోతు మేర పారింది. దీంతో వ్యవసాయ కార్మికులు, రైతులకు పొలాల్లోకి వెళ్లి దారి లేకుండా పోయింది.

వారంతా అక్కడికి చేరుకుని నిరసన వ్యక్తం చేశారు. రామారావుపేట గ్రామంలోని ఆదివాసి గిరిజన పొలాల్లోకి వెళ్లడానికి ఉన్న ఈ ఒకే ఒక్క దారికి సంబంధించి రహదారి నిర్మించాలని ఏళ్ల తరబడి మండల అధికారులకు దరఖాస్తులు చేశామని, అయినా పట్టించుకోవడం లేదని విమర్శించారు. తక్షణమే అధికారులు రోడ్డు నిర్మాణం చేపట్టి బాధలు తొలగించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం రామారావు పేట జోన్ బాధ్యుడు బత్తుల వెంకటేశ్వర్లు, మండల కమిటీ సభ్యులు సోడే రాంబాబు, వర్స చిన్నారావు, వర్స వీరస్వామి, కారం వీరస్వామి, కారం సీతారాములు తదితరులు పాల్గొన్నారు.


'థెరిస్సా'కు సేవలతో నివాళి



ములకలపల్లి: వృద్ధులకు దుస్తులు, పండ్లు అందజేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

భద్రాచలంఅర్బన్: మదర్ థెరిస్సా జయంతి సందర్భంగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలోని కహల్ ట్రైబల్ బాలల ఆశ్రమంలో శనివారం అన్నదానం చేశారు. అనంతరం ఆశ్రమానికి 50 కేజీల బియ్యం అందజేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు భీమవరపు వెంకటరెడ్డి మథర్ థెరిసా చేసిన సేవలను ఆశ్రమంలోని చిన్నారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు బోనాల సూర్యనారాయణ, బిల్లీ పెళ్లి రంగారెడ్డి, ఉమా శంకర్ నాయుడు, దాట్ల శ్రీనివాసరాజు, పంజా సునీల్, కాంత్, కోణాల జయరాజు, పి. రవికుమార్, నరసింహ చారి, రామలింగేశ్వరరావు, సంస్థ నిర్వాహకులు వేణు తదితరులు పాల్గొన్నారు.
మణుగూరురూరల్: మథర్ థెరిస్సా జయంతి సందర్భంగా ఎక్సలెంట్ పాఠశాల విద్యార్థులు శనివారం సేవా కార్యక్రమం చేపట్టారు. ముఖ్య అతిథిగా ఎస్సై రాజేష్ కుమార్ హాజరయ్యారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలోని రోగులకు పండ్లు, బ్రెడ్లు, అనాథ ఆశ్రమంలోని అన్నార్తులకు దుప్పట్లు, చద్దర్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై రాజేష్‌కుమార్ మాట్లాడారు. అనంతరం ఎక్సలెంట్ విద్యాసంస్థల చైర్మన్ ఎండీ. యూసఫ్ షరీఫ్ మాట్లాడుతూ.. మాతృమూర్తి మథర్ థెరిస్సా సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు ఆనంద్, ఎక్సలెంట్ విద్యాసంస్థల కరస్పాండెంట్ ఎండి ఖాదర్, డైరెక్టర్ యాకుబ్‌షరీఫ్, సిబ్బంది పాల్గొన్నారు.
దమ్మపేట: మండల పరిధిలోని అంకంపాలెం ఆశ్రమ పాఠశాలలో మదర్ థెరిస్సా జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ తోలెం వెంకటేశ్వర్లు మాట్లాడారు. కార్యక్రమంలో వార్డెన్ సౌజన్య, నాగేంద్రమ్మ, రజిని, రవి, గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.
ములకలపల్లి: మదర్‌థెరిస్సా జయంతి వేడుకలను మండలవ్యాప్తంగా శనివారం ఘనంగా జరుపుకున్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ కిన్నెర, పాల్వంచ కిన్నెరసాని ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్థానిక మంగపేట పీహెచ్‌సీలో రోగులకు పాలు, పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. నిరుపేద వృద్ధులకు చీరెలు, పండ్లు అందజేశారు. క్లబ్ అధ్యక్షుడు కేథారేశ్వరరావు, సెక్రటరీ ఎండి.రంజాన్. రేపాక శ్రీనివాసరావు, ట్రెజరర్ కొమ్ము నాగరాజు, డిస్ట్రిక్ చైర్‌పర్సన్ బి.సుధాకర్, సాంబశివరావు, దారా నర్సింహారావు, ఎస్‌పీ. నాయుడు, మార్కెటింగ్ చైర్‌పర్సన్ పాండురంగాచారి, అనంతుల మహేశ్, కుంజా జగన్ తదితరులు పాల్గొన్నారు.


ఆశా వర్కర్ల నిరసన




దమ్మపేట: తహసీల్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఆశావర్కర్లు

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆశావర్కర్లు శనివారం నిరసన వ్యక్తం చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీలు, ధర్నాలు చేపట్టి నినాదాలు చేశారు. తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ఆందోళనలు చేపట్టి తహసీల్దార్లకు వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఆశావర్కర్లకు కనీస వేతనంగా రూ.18 వేలు చెల్లించి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



అశ్వారావుపేటరూరల్: తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తూ..



చంద్రుగొండ: తహసీల్దార్ సాదియాసుల్తానకు మెమోరాండం అందిస్తున్న ఆశావర్కర్లు